# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 25 ఆగస్టు 2023


## రైల్వే ప్రాంతంను తనిఖీ నిర్వహించిన ఎడిఆర్ఎం



కార్యాలయంను తనిఖీ చేస్తున్న ఎడిఆర్ఎం

నందలూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

నందలూరు మండలం రైల్వేకేంద్రంను గుంతకల్ డివిజన్ కార్యాలయం అసిస్టెంట్ డివిజన్ రైల్వే మేనేజర్ (ఇన్‌ప్రా) యు.సుధాకర్ రైల్వేస్టేషన్, రన్నింగ్‌రూమ్, ఆర్‌పిఎఫ్ బ్యారక్‌లను అందులో ఉండే సౌకర్యాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎవైన సమస్యలు ఉంటే ఆఫీసుకు సమాచారం అందిస్తే కావల్సిన వస్తువులు డివిజనల్ కార్యాలయం నుంచి అందజేస్తామని తెలిపారు. అనంతరం క్రూ బుకింగ్ రూంలోని రికార్డులను తనిఖీ నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని అన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా నందలూరు రైల్వే కేంద్రంలో కరోనాకు ముందు పలు రైళ్లు ఆగేవని, కరోనా తర్వాత ఆ రైళ్లు నిలుపుదల చేయలేదని అడుగ్గా దీనిపై ఆయన సమాధానం ఇస్తూ ప్రజల అవసరాల దృష్ట్యా వారు తమని ఏదైనా లేఖ రాసిన దానిపై స్పందిస్తామని తెలిపారు. అలాగే క్రూ మార్పు అనేది లోకో పైలట్ మైలేజ్ దృష్టిలో ఉంచుకొని చేశామని అన్నారు. ఆయనతో పాటు డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రుక్సానా హత్యకేసులో ప్రధాన సూత్రదారి అరెస్టు



అయేషాను అరెస్టు చూపుతున్న డిఎస్‌పి

మదనపల్లెక్రైం, ఆగస్టు 24

ప్రభాతవార్త :

మదనపల్లెలో ఇటీవల జరిగిన లెక్చరర్ రుక్సానా హత్యకేసులో గురువారం ప్రధాన సూత్రదారి అయేషాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. స్థానిక రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుక్సానా హత్యకు సంబంధించి మొత్తం 12మందిపై కేసు నమోదు చేశామన్నారు. విడతల వారీగా పదిమందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, తాజాగా అయేషాను అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు. అలాగే ఏ12 ముద్దాయిగా తంజూమ్‌బేగంను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తామని వివరించారు. ఈ కేసులో ఆయేషా ప్రధానపాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మురళీక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగళ్లు అల్లర్లపై చంద్రబాబుకు బెయిల్ ఇవ్వకండి

### పుంగనూరు ఘటన భయభ్రాంతులకు గురిచేసింది - శవరాజకీయాల కోసం చంద్రబాబు యత్నించాడు

### హైకోర్టు అడ్వికేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి, న్యాయవాదులు

మదనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో ఈనెల 4న అంగళ్ళులో చోటు చేసుకొన్న అల్లర్లు, పుంగనూరు విద్వంస ఘటనలకు కారకులైన మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుతో పాటు ఈ రెండు ఘటనలకు సంబంధించి కేసుల్లో ఉన్నవారికి బెయిల్ ఇవ్వదంటూ హైకోర్టు అడిషనల్ అడ్వికేట్ జనరల్ పి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు బెయిల్ రద్దుకు ఆయన వాదనలు వినిపించారు. అనంతరం సాయంత్రం మదనపల్లె డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పర్యటించినపుడు యుద్దబేరి పేరుతో యాత్ర చేశారన్నారు. ఈ యాత్ర పూర్తిగా డిజిపి ఇచ్చిన అనుమతులను ఉల్లంఘించారన్నారు. విధ్వంశాన్ని సృష్టించాలన్న నెపంతోనే యాత్ర కొనసాగిందన్నారు. అంగళ్ళులో ప్రతిపక్షనేత యాత్ర సాగించే మునుపు ముదివేడు రిజర్వాయర్‌కు సంబంధించి అక్కడి రైతులు నల్లబ్యాడ్జిలు వేసుకొని ఎన్‌జిటి స్టే ఎత్తివేయాలని శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిని చంపండి, కొట్టండి అంటూ ఆయన ప్రోత్సహించడం వల్లే వారిపై టిడిపి నాయకులు, కార్యకర్తలు దాడులు చేశారన్నారు. ఇదే అక్రోశంతో 30కిలోమీటర్ల వరకు యాత్ర జరిపి 5వేల మందితో పుంగనూరులోకి ప్రవేశించేందుకు యత్నించడంతో అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే ఏర్పాటు చేసిన బారికేడ్లు, పోలీస్ వ్యానులను ధ్వంసం చేసి 47మంది పోలీసులను తీవ్రంగా గాయపరిచారన్నారు. ముందస్తుగా విధ్వంసం వ్యూహరచనతోనే ఆ నియోజకవర్గ నాయకులు చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లాబాబు పోలీసులపై మారుణాయుదాలతో దాడులు చేయించారన్నారు. పోలీసులను రెచ్చగొట్టి గాయాలకు గురిచేస్తే వారు కాల్పులు జరిపితే చనిపోయిన వారి శవాలతో రాష్ట్రమంతా శవయాత్ర చేసి ప్రజల మన్ననలను పొందేందుకు చంద్రబాబు కుట్ర పన్నారన్నారు. అక్కడున్న సిసి కెమరాలను సైతం విధ్వంసం చేసి చట్టాన్ని టిడిపి నాయకులు చేతుల్లోకి తీసుకొన్నారన్నారు. ఎస్‌పి సహనంతో ఉండడం అభినందనీయమన్నారు. మొలకలచెరువు టు చిత్తూరు వరకు జరిగిన చంద్రబాబు యాత్ర పూర్తిగా విధ్వంస కాండను సృష్టించేందుకే పన్నాగం పొందారన్నారు. ఇటువంటి వారికి బెయిల్ ఇస్తే సమాజంలో మరిన్ని విధ్వంసాలు జరిగే ప్రమాదం ఉందని చెప్పడం జరిగింది. 14ఏళ్ళు సిఎంగా, 17ఏళ్ళుగా ప్రతిపక్ష నాయకునిగా ఉన్న చంద్రబాబు నేరాన్ని ప్రోత్సహించడం మరింత దారుణమన్నారు. అధికార దాహం కోసం ఇలాంటి ఘటనలు చేయడం క్షమించరాదన్నారు. అల్లకొల్లలం చేసి రాజ్యాధికారం కావాలనుకోవడం సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేసినట్లేనన్నారు. రావణకాష్టంకు పాల్పడి అనేకమందికి గాయాలకు గురికి కారుకులైన వీరికి బెయిల్ ఎలాంటి పరిస్తితుల్లో ఇవ్వరాదన్నారు. నేరాలకు ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరిపైన చర్యలు తప్పవన్నారు. బెయిల్ విషయంపై రెండవ అదనపు జిల్లా జడ్జి సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో హైకోర్టు పిపి దశ్వంత్‌రెడ్డి, డిఎస్‌పి కేశప్ప, మదనపల్లె ఏపిపిలు టి.రామక్రిష్ణ, జి.జనార్థన్‌రెడ్డి, ఎం.చంద్రకుమార్‌రెడ్డి, న్యాయవాధి జి.దినేష్‌కుమార్‌రెడ్డి, సిఐలు శివాంజనేయులు, సత్యనారాయణలు పాల్గొన్నారు.

## జాతీయ రహదారులకు భూసేకరణ పనులు వేగంగా పూర్తిచేయాలి : కలెక్టర్ గిరీష పిఎస్



రాయచోటి, ఆగస్టు 24 ప్రభాతవార్త :

జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని జాతీయ రహదారుల భూసేకరణ అంశంపై ఆర్డీఓలు, తహసిల్దార్లతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలోని రాజంపేట, నందలూరు, పుల్లంపేట, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లిలలో మండలాల వారీగా ఎన్ని ఫైల్స్ పెండింగ్లో ఉన్నాయి, ఎంత చెల్లింపులు చేయాల్సి ఉందన్న అంశంలో ఆయా తాసిల్దారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీరికి సంబంధించిన చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. భూములకు సంబంధించి కోర్టులో కేసులు ఉంటే ఆయా సర్వే నెంబర్లకు సంబంధించి డబ్బు కోర్టులో డిపాజిట్ చేయాలని సూచించారు. అలాగే సేకరించిన భూమిలో ఏవైనా స్ట్రక్చర్స్ ఉంటే వాటిని గుర్తించి త్వరితగతిన ఫైనలైజ్ చేయాలని ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు. రైల్వే మరియు అటవీ పోరంబోకు జెడ్ హెచ్ డిసి భూములకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కగా పాటించాలన్నారు. ఏ అవార్డుకు ఎంత నగదు చెల్లింపు చేశారన్న వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. ఇప్పటివరకు అవార్డ్ పాస్ చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చిన మేరకు భూములను వెంటనే ఎన్హెచ్ అధికారులకు స్వాధీనం చేయాలని తాసిల్దారులకు చెప్పారు. భూసేకరణ ప్రక్రియలో పురోగతి కనిపించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్డిఓ లు రాయచోటి మదనపల్లి,రాజంపేట రంగస్వామి, మురళి, రామకృష్ణ రెడ్డి, ఎన్ హెచ్ఎఐ అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల వెరిఫికేషన్ పక్కాగా ఉండాలి

### తేడా వస్తే వేటు తప్పదు - ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి



ఓటర్ వెరిఫికేషన్‌పై మాట్లాడుతున్న ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి, సమావేశంలో పాల్గొన్న తహశిల్దారులు, ఎన్నికల డిటిలు, బిఎల్ఒలు

రాజంపేట అర్బన్, ఆగస్టు 24 ప్రభాతవార్త

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పక్కాగా ఓటర్ వెరిఫికేషన్ జరగాలని లేదంటే ఇబ్బందులు పడతారని రాజంపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ జి.రామక్రిష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో ఓటర్ రీ వెరిఫికేషన్‌పై ఆయన మాట్లాడుతూ గత యేడాది జూన్ నుంచి తొలగించిన ఓట్లపై పక్కాగా వెరిఫికేషన్ చేయాలన్నారు. ఓటర్ల షిఫ్టింగ్‌పై కూడా తప్పనిసరి ఆధారాలు ఉండాలన్నారు. మరణించినవారి ఓటును తీసివేసే విషయంలో కూడా సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. స్వయంగా పరిశీలన లేదా విఆర్ఒ, ఎఇఆర్ఒ, బిఎల్ఒల వద్ద హాజరైన తర్వాతే ఏ నిర్ణయమైన తీసుకోవాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఓట్ల తొలగింపు, డబల్ ఎంట్రీలు తొలగించిన వారి ఓట్ల తొలగింపు, ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో లేకపోయినా నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి, ఇతర తహశిల్దారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం తులసిరెడ్డి



బి.మఠం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో బ్రహ్మం సాగర్ జలాశయాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ రాజ్యసభ సభ్యులు నరెడ్డితులసి రెడ్డి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రహ్మం సాగర్ లీకేజీ పనులు నిమిత్తం ఓ కంపెనీకి 46.68 కోట్లు ఖర్చు చేసిన లీకేజీ అగలేదు సరి కద అధికమైందని, కుడి ,ఎడమ కాల్వల ,ద్వారా బ్రహ్మ సాగర్ ద్వారా నీటిని మండలంలోని చెరువులకు నింపుతున్నారు తప్ప, పిల్ల కాల్వలను నిర్మించి ఏ ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేదని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కాలజ్ఞాన కర్త పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు దాతలు కట్టించిన బస్ షెల్టర్ తొలగించడం దుర్మార్గమైన చర్య అని ,అభి వర్ణించారు. కాంగ్రెస్ పార్టీ పంచ ముఖ వ్యూహం అరు సూత్రాల పథకాలతో ప్రజల్లోకి వెళ్తొందని రాబోవు 2024వ సంవత్సరం ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేయడం ఖాయమని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయ కన్వీనర్ గుండ్లకుంట శ్రీరాములు అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, బాలు నాయుడు, షేక్ నాయుబ్ రసూల్ కార్యకర్తలు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్



కడప, ఆగస్టు 24 ప్రభాతవార్త :

ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని.. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, జగనన్న సురక్ష, తదితర అంశాలపై.. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ తో పాటు డీఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబందిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించేలా పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడి, వైయస్సార్ క్లినిక్ లు, తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టిని సారించి వెంటనే పనులు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నాడు- నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయమై మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో, ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమావేశం నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరుగా తీసుకెళ్లేందుకు ఆయా శాఖల ద్వారా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి, సీపీవో వెంకట్రావు,డిఆర్డీఏ మెప్మా, ఐ సీడీఎస్, హౌసింగ్,ఎస్ ఎస్ ఏ పీవో ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, శ్రీలక్ష్మి, కృష్ణయ్య, అంబావరం ప్రభాకర్ రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే ఇంటింటికి వస్తున్నాం : ఎంపి మిథున్‌రెడ్డి



మందపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపి మిథున్‌రెడ్డి, మేడా, ఆకేపాటిలు

రాజంపేట అర్బన్, ఆగస్టు 24 ప్రభాతవార్త

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కాగా ప్రజలకు అందుతున్నాయా లేదా? ఇంకా సమస్యలు ఏమైనా ఉన్నాయా? తెలుసుకునేందుకే ప్రతి ఇంటికి వస్తున్నామని రాజంపేట ఎంపి పివి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మందపల్లె, కోపురాజుపల్లె, శేషమాంబపురం గ్రామాల్లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో స్వయంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకంతో పాటు బటన్ నొక్కి విడుదల చేస్తున్న సొమ్ము మీకు చేరుతుందా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలనుద్ధేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ప్రధానంగా పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యంగా వైకాపా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందకపోతే అర్థం లేదన్నారు. అందుకే నేరుగా ప్రజల వద్దకే వస్తున్నామని పేర్కొన్నారు. సమస్యలు ప్రస్తావించిన వారి వివరాలు తెలుసుకుని ఎమ్మెల్యే, జడ్‌పి చైర్మన్లకు పరిష్కరించేలా చూడాలని సూచించారు. తాను కూడా ప్రజలు వివరించిన సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు ఆకేపాటి మురళీరెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, జెసిబి సుబ్బారెడ్డి, పి.విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల్లో కానరాని సిబ్బంది...

### సిఎం జగన్ మానసపుత్రిక పథకానికి తూట్లు



ఖాజీపేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :

ఎవరేమనుకున్నా మా తీరు మారదు మేమింతే అన్నట్లు ఉంది సచివాలయ ఉద్యోగస్తుల తీరు. ఆగస్టు 15న పుల్లూరు సచివాలయంలో ఏడు మందికి పైగా సచివాలయ సిబ్బంది జెండా వందన కార్యక్రమానికి హాజరుకాని విషయం పాఠకులకు విధితమే. వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా సచివాలయ సిబ్బంది కూడా అదే బాటలో పయనిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గురువారం నాడు కూనవారిపల్లె సచివాలయాన్ని 'వార్త' సందర్శించగా అక్కడ కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు మిగతా సిబ్బంది ఏమయ్యారో ఎవరికీ సమాచారం లేదు వారు అసలు విధుల్లో ఉన్నారా సెలవుల్లో ఉన్నారా అనే సమాచారం కూడా లేదు. ప్రజల ముంగిటికే సేవలు అని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వ నినాదానికి తూట్లు పొడుస్తూ ఉన్నారు ఇక్కడి సచివాలయ సిబ్బంది. ఈ సిబ్బంది కోసం సామాన్య జనం గంటల తరబడి సచివాలయంలో ఎదురుచూస్తూ సచివాలయ ఉద్యోగస్తుల పైన అసహనం వ్యక్తం చేస్తుండడం కనిపించింది. గతంలో రావులపల్లె సచివాలయంలో సిబ్బంది గైర్హాజరైనప్పుడు ఎలాంటి చర్యలు లేవు, నిన్న పుల్లూరులో సిబ్బంది గైర్హాజరైతే ఎలాంటి చర్యలు లేవు మనలని ఎవరేం చేస్తారులే అన్న నిర్లక్ష్యం ఒక అంటురోగం లా మండలంలోని అన్ని సచివాలయాలకు పాకుతొంది అనడంలో అతిశయోక్తి లేదనిపిస్తోంది. ఇక కూనవారిపల్లెలో పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని 'వార్త' సందర్శించగా పూర్తిగా తాళం వేసి ఉండడం కనిపించింది.గత పది రోజుల నుండి రైతు భరోసా కేంద్రానికి తాళం వేసినట్లుగా ఏ ఉద్యోగి ఎప్పుడు వస్తున్నాడో ఎప్పుడు పోతున్నాడో అసలు వస్తున్నారో రావట్లేదో మాకు తెలియకుండా ఉంది అని రైతులు, గ్రామస్తులు తెలిపారు. సచివాలయ సిబ్బంది మీద చర్యలు తీసుకోవడంలో మండల ఎంపీడీవో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మైదుకూరు శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ , ఉన్నతాధికారులు ఇలాంటి నిర్లక్ష్య పూరితమైన సచివాలయ ఉద్యోగస్తుల పట్ల చర్యలు తీసుకొని తద్వారా మిగతా వారిని అందరిని ఒక గాడిన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

## నగరంలో నిటి ఎద్దడి

### స్పందించని కార్పొరేషన్ అధికారులు

కడప, ఆగస్టు 24, ప్రభాతవార్త :

నగర పాలక సంస్థ అయిన కడప నగరంలో సాయిపేట, అగాడి, బెల్లంమండి, సంఘం ఫంక్షన్ హాలు పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేషన్ నీటి రాకకోసం ఆయా ప్రాంతాలల్లోని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సకాలంలో నీరు రాకపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు గత మూడు నెలలుగా నీటి సమస్యపై పిర్యాదులు ఇస్తున్నా స్పందించడం లేదని స్థానికులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సకాలంలో నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మంజూరు అయి అందని లబ్ధిదారులకు చేయూత

### అర్హులైన 19,003 మంది లబ్ధిదారులకు రూ.6.98 కోట్ల లబ్ధి

### జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



రాయచోటి, ఆగస్టు 24 ప్రభాతవార్త :

తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ది అందని వారికి లబ్ది అందించడంలో భాగంగా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫ రెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖా న్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నవరత్నాలు - ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హులైన వారందరికీ నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అన్నమయ్య జిల్లాలో 19,003 మంది లబ్ధిదారులకు గాను రూ.6.98 కోట్ల లబ్ధి చేకూర డం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహా యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అర్హులై ఉండి ఏ కారణం చేత నైనా లబ్ది అందని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పి స్తూ అన్నమయ్య జిల్లాలో వైఎస్ఆర్ నేతన్న నేస్తం ద్వా—20 మంది లబ్ధిదారులకు 4.80 లక్షలు, వైయస్సార్ ఈ బిసీ నేస్తం ద్వారా 383 మందికి 57.45 లక్షలు, జగనన్న చేదోడు ద్వారా 1123 మందికి112.30, జగనన్న అమ్మఒడి ద్వారా 622 మందికి 93.30 లక్షలు, వైయస్సార్ ఆసరా ద్వారా50 మందికి15.18 లక్షలు, జగనన్న విద్యా దీవెన ద్వారా 2002 మందికి248.14 లక్షలు, జగనన్న వసతి దీవెన ద్వారా1734 మందికి152.44 లక్షలు, వైయస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్ ద్వారా275 మందికి15.01 లక్షలు లబ్ది చేకూరడం జరిగిందన్నారు. ఇందులో రైస్ కార్డ్స్7249 మందికి, ఆరోగ్యశ్రీ కార్డులు 1588 మందికి, హౌస్ సైట్ పట్టాలు 12794 మందికి ఇవ్వడం జరిగిందన్నారు

## 'పోలా' వివాహ వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి



రాజంపేట అర్బన్, ఆగస్టు 24

ప్రభాతవార్త

రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి కుమారుడు సాయివైభవ్ వివాహ వేడుకల్లో రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి, ఎంపి పివి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు మేడా రఘునాథ్‌రెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు జిల్లాలోని వైకాపా ముఖ్య నేతలు పాల్గొన్నారు. తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొని సాయివైభవ్ దంపతులను ఆశీర్వదించారు.

## వైభవంగా శ్రీరామకోటి

**రామసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

మండలంలోని కురిజల గ్రామ పంచాయితీ, గుట్టపాలెం గ్రామంలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి గుడిలో శ్రీరామకోటి వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు, అభిషేకాలు నిర్వహించి శ్రీరాముని చిత్రపటానికి పూజలు నిర్వహించి రామకోటి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఓటర్ల జాబితాను తనిఖీ చేసిన ఈఓఆర్‌డి



**రామసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీలో హరిజనవాడ లో మండల ఈఓఆర్‌డి షబీనా ఆధ్వర్యంలో గురువారం ఓటర్ల జాబి తాను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ చెంబకూరు పంచాయితీలో 218 విభాగంలోని ఓటర్లు సుమారు 120ఓటర్ల, కాప్పల్లి పంచా యితీలోని 219న విభాగంకు నమోదైన సందర్భంగా వాటిని వెంటనే చెంబకూరు పంచాయతీలోని 218 విభాగంకు నమోదవు చేయాలని కాప్పల్లి సచివాలయం సిబ్బంది చెంబ కూరు సచివాలయం సిబ్బందికి తెలిపారు. 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో చెంబకూరు గ్రామ పంచాయితీ విఆర్ఓ శేఖర్, కాప్పల్లి సచివాలయం వేల్ఫేర్ అసిస్టెంట్ నారాయణస్వామి, చెంబకూరు 218 విభాగం బిఎల్ఓ సుధాకర్, గ్రామస్థులు శంకర్, నారాయణ, రాజేష్, నరసిం హులు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మట్టి కలిశం అందజేత



**కురబలకోట, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

మండలంలోని 13 గ్రామ పంచాయితీల్లోని పవిత్రస్థలాల నుంచి సేకరించిన మట్టి కలిశాన్ని గురువారం ఎన్‌జిఓ ప్రతినిధి జగదీష్‌కు ఎంపిడిఓ కార్యాలయం వద్ద అందజేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఈ మట్టి కలిశాన్ని జిల్లాకు, అక్కడ నుంచి ఢిల్లీలోని ఖర్తార్‌పండ్ మార్గంలో దేశవ్యాప్తంగా సేకరిం చిన మట్టిని అక్కడచేర్చి వివిధ మొక్కల నాటడానికి ఉపయోగిస్తారని తెలిపారు. ఈమట్టికలిశాన్ని ఎంపిపి దస్తగిరిసాబ్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమం లో ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఏపిఎం నీరజ, ఏపిఓ వెంకటేష్, వెలుగు సిబ్బంది, సిసిలు సయ్యద్‌బాషా, శ్రీనివాసులు, సతీష్ పాల్గొన్నారు.

## పల్లెబాటలో డ్రైనేజి, నీటి సమస్యలు పరిష్కరించాలని వినతి



**పెద్దమండ్యం ఆగస్టు 24 ప్రభాతవార్త**

మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయితీలో గురువారం జరిగిన పల్లె బాట కార్యక్రమంలో ఎంపిపి పూర్ణ చంద్రి కా రమేష్, సర్పంచ్ పద్మావతీ తిరు పాల్, అధికారులు, సచివాలయసిబ్బంది మండల ప్రజ ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిట్టావాండ్లపల్లెలో డ్రైనేజి కాలువలు శుభ్ర పరిచి, మంచినీటి సమస్యను పరిష్కరించాని కోరారు. ఇటీవల వేసిన బోరులో నీరుపుష్కలంగా వచ్చేది కాని ఇప్పుడు కొద్దిరోజులుగా గ్యాప్ వస్తూ నీరు రావడం లేదని ఆర్‌డబ్యూఎస్ ఏఈ హరికి వివరించారు. జల జీవన్ నిధుల ద్వారాప్రత్యామ్నాయంతో సమస్యలను పరిష్కరిస్తామని కొత్త ఇండ్ల కు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. చిన్నచిన్న సమస్యలను అక్కడి క్కడే పరిష్కారం చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాము, ఎంపిడివో శ్రీదర్, ఎపివో మురళి, ఎపిఎం సూరి, ట్రాన్స్‌కో ఏఈ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనపై క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



**కడప వైద్యవిభాగం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మారణకాండకు నిరసనగా కడప పట్టణ క్రైస్తవ సమైక్య ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చి నుంచి కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్ గుండా తిరిగి సీఎస్ఐ చర్చి వరకు క్రైస్తవులు భారీ ర్యాలీ శాంతియుతంగా నిర్వ హించారు. మణిపూర్‌లో అల్లరిమూకలు క్రైస్తవులపై దాడులు చేసి, చర్చీలను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవజనులు ప్రసన్నకుమార్, ఆరోగ్యమాత చర్చి ఫాదర్ విల్సన్, కృపానందం, న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ మహేష్, రాజారత్నం ఐజాక్, షద్రక్, బాబూరావు, జాన్, దానియేలు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండూరులో పొలంబడి కార్యక్రమం



**పెండ్లిమర్రి, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

మండలంలోని కొండూరి గ్రామంలో వరిపై పొలంబడి కార్యక్రమాన్ని ఏవో బ్లెస్సీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ వరిపై రైతు లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి నాట్లు వేసే సమయంలో నాటుకునే పద్ధతి, మందుల వాడకం, పిచికారి విధానం గురించి క్షుణ్ణంగా వివరిం చారు. ఈ క్రాప్ పంట నమోదు ప్రతి రైతు చేయించుకోవాలని సూచించారు. తద్వారా కలిగే ఉపయోగాలు వారికి వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ ఉషా, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు బనాయించడం సరికాదు

**– భారత చైతన్య యోజన పార్టీ జాతీయ అధ్యక్షులు రాచంద్రయ్య యాదవ్**

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**



పుంగనూరులో జరిగిన సభలో అక్రమ కేసులు పెట్టి కడప సబ్‌జైల్లో ఉన్న వారిని అఖిల మహా యాదవు ల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పోలి శివ యాదవ్ ఆధ్వర్యంలో పరామ ర్శించే కార్యక్రమంలో ముఖ్య అతిథి గా భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు రామచంద్రయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు బనాయించ డం సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో అధికార పార్టీ అరాచకాలు పెరిగి పోయాయన్నారు. పుంగనూరు కేసులో కడప సెంట్రల్ జైలులో ఉన్న తమ పార్టీ అనుచరులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయ కులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బహుజనులు ఏకమై రాజ్యాధికారం సాధించాలి

**– బీఎస్‌పీ కడప జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గురప్ప**



**కడప వైద్యవిభాగం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

బహుజన సమాజ్ పార్టీ కడప జిల్లా ముఖ్య కార్యకర్త సమావేశం స్థానిక బీఎస్పీ జిల్లా కార్యాలయ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు డీఎస్ జయరాం అధ్యక్ష తన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బహుజన సమాజ్ పార్టీ కడప జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గురప్ప, ఓబయ్య హాజరై మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ఆదేశాల మేరకు ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమంలో భాగంగా కడప జిల్లాలో ఉన్న 7 అసెంబ్లీలో ఉన్న అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి బీఎస్పీ సిద్ధాంతాన్ని వారం దరిని సమాజ్ పార్టీ వైపు మళ్లించే విధంగా కృషి చేయాలని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలను ఏకం చేసి అనగారిన వర్గాలకు రాజ్యాధికారం అందించే విధం గా సమాజ్ పార్టీకి దగ్గర చేయాలని ఈ సందర్భంగా సూచిం చారు. కార్యక్రమం లో మైదుకూరు అసెంబ్లీ అధ్యక్షుడు నాగార్జున, కమలాపురం అసెంబ్లీ అధ్యక్షులు రాజన్న, ప్రొద్దుటూరు అధ్యక్షులు వెంకట నారాయణ, మైదు కూరు అసెంబ్లీ నాయకులు బాలుడు, బీఎస్పీ నాయకులు హాజరయ్యారు.

## అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్




**కడప వైద్యవిభాగం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

అక్రమ సంపాదనలతో ఈడీ కేసుల్లో 17 నెలలు జైలు జీవితం గడిపి నేటికీ క్రిమినల్ ముద్దాయిగా ఉన్న సీఎం జగన్ అరాచక పాలన సాగిస్తూ చరిత్ర హీనుడిగా మిగిలిపోయారని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు తీవ్రంగా విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు నిలుపుదల చేశారన్నారు. పేదలకు 25లక్షల పక్కా ఇళ్లను నిర్మిస్తానని చెప్పి నేటికి 2లక్షలు ఇళ్లు కూడా పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులు దాచుకున్న భవిష్యనిధి జీపీఎఫ్ నిధులను అక్రమంగా వాడుకోవడం ఇంటి పన్ను, కరెంటు బిల్లులు, పేద వితం తువులు, వయో వృద్ధులు, వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడం దుర్మా మన్నా రు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాజర్ అలీ, నగర తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణంపై సమీక్ష

**దువ్వూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం నిర్మించే పక్కా గృహాల నిర్మాణాలను వేగ వంతం చేయాలని మండ ల ప్రత్యేక అధికారి ఓబు లేసు నందన్, తహసీ ల్దార్ రమాకుమారీలు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో గృహ నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భండా అధికారులు మాట్లాడుతూ ప్రతి వారం గృహ నిర్మాణా లలో పురోగతి కనిపించాలన్నారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలు, ఆర్‌బీకే లు, వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## 27న జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 24, ప్రభాతవార్త**

భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు నెల 27న ఆదివారం ఉదయం 9:30 నిమిషములకు అని బిసెంట్ మున్సిపల్ హై స్కూల్ ఆట స్థలము ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

14 సం లోపు బాల బాలికలకు 60 మీ 600 మీ కిడ్స్ జావెలిన్

16 సం లోపు బాల బాలికలకు 100 మీ 300 మీ 800 మీ షార్ట్ పుట్ డిస్కస్ త్రో జావలిన్

18 సం లోపు బాల బాలికలకు 100 మీ 200 మీ 400 మీ 800 మీ1500 మీ షాట్ పుట్ డిస్కస్ త్రో జావెలిన్ త్రో

20 సం లోపు స్త్రీ పురుషులకు 100 మీ 200 మీ 400 మీ 800 మీ 1500 మీ షార్ట్ పట్ డిస్కస్ త్రో జావెలిన్ త్రో

ఈ క్రీడాంశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించబడునని ఇందులో కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చని, క్రీడాకారులందరూ వయసు ధ్రువీకరణ పత్రములు డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ లేక ఆధార్ కార్డు తమ వెంట27వ తేదీన ప్రొద్దుటూరులో జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

ఈ క్రీడాంశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించబడునని ఇందులో కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చు, క్రీడాకారులందరూ వయసు ధ్రువీకరణ పత్రములు డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ లేక ఆధార్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలి ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని సెప్టెంబర్ నెలలో ఏలూరులో జరగబోయే ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కు ఎంపిక చేయబడతారని భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి ఆహ్మర్ భాష మరియు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బసిరెడ్డి వీర కళ్యాణ్ రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని సెప్టెంబర్ నెలలో మరిన్ని వివరాలకై 8019880995 మొబైల్ కి సంప్రదించలన్నారు.

## కడప ఉక్కు కోసం 25న చలో విజయవాడ : డీవైఎఫ్ఐ పిలుపు

**జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

రోజు రోజుకు పెరుగుతున్న నిరుద్యోగ సమస్యపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరుద్యోగం – పరిష్కార మార్గాలు అనే అంశంపై ఈనెల 25న విజయ వాడలో జాతీయ సదస్సు ఏపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహణ జరుగు తుందని ఈ సదస్సుకు ప్రతి ఒక్క నిరుద్యోగి పాల్గొని జయప్రదం చేయా లని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి వీర నాల శివకుమార్ పిలుపునిచ్చారు. జాతీయ సదస్సు కరపత్రాలను గురువారం జమ్మలమడుగులోని కాలేజీలలో పంపిణీ చేశారు. సదస్సుకు రాజ్యసభ సభ్యులు డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు రహీం, శాసనమండలి సభ్యులు వెంకటే శ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. యువతీ యువకులు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రాఘవ, ఉదయ్, సూరి పాల్గొన్నారు.

## సమాజ సేవలో ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్



**ఓబులవారిపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లోనూ ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ ముందుకు వస్తూ ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. గురువారం మండల పరిధిలోని చలంపాలెం గ్రామంలో రాజేష్, రాజు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన కుటుంబ భ్యులకు ఆసుపత్రికి ఖర్చులకు గాను రూ.లక్ష చెక్కు రూపంలో ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ఆలయాలకు ఆర్థిక సహాయం అందించి సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకున్నారని సమాజ సేవకు కృషి చేస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డికి అభినందనలను పలువురు తెలుపుతున్నారు.

## రాష్ట్రషంలో రాక్షస పాలన..

**– సెంట్రల్ జైల్లో దేశం నాయకులను పరామర్శించిన దేశం నేతలు**



**కడప వైద్యవిభాగం, ఆగస్టు 24, ప్రభాతవార్త:**

రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయక, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, హిందూపురం పార్లమెంటు అధ్యక్షులు పార్థసారథిలు గురువారం పుంగనూరు, అంగళ్ల అల్లర్ల కేసులో కడప సెంట్రల్ జైల్లో ఉన్న ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను పరామర్శించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైకాపా పాలన రాక్షస పాలనను తలపిస్తోం దని మండిపడ్డారు. అంగళ్ల అల్లర్ల కేసులో చిత్తూరు, కడప, మదనపల్లె జైళ్లలో 400 మంది ఉన్నారన్నారు. ప్రతిపక్షంలో జగన్ పాదయాత్ర చేసే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఎం చంద్రబాబు భద్రత కల్పించారని వారు గుర్తు చేశారు. ఇలాంటి పాలన ఎక్కడా చూడలేదని వచ్చే ఎన్నికల్లో ఈ పాలనకు ప్రజలు చరమగీతం పాడతారన్నారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి, హరిప్రసాద్, గోవర్ధన్, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రామాంజి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై సమీక్షా సమావేశం



**గోపవరం,ఆగస్టు 24 ప్రభాతవార్త;**

స్థానిక మండల కాప్లెక్స్‌లో ఉన్న ఎంపిడిఓ సభా భవనంలో గురువారం అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఎంఎస్ఓ మర్రిపాటి నాగరాజు,ఈఓపిఆర్‌డి షేక్ హసీనాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలందరికీ పక్కా గృహాలు,వ్యక్తిగత మరుగు దొడ్లు, ఉపాధి హామీ,డ్రిప్ స్పింకర్లు, పంట నమోదు,ప్రతి రైతుకు ఎరువులు అందుబాటులో ఉండటం, జగనన్నకు చెపుదాం,ఈకెవైసి,లాంటి తదితర విషయాలపై చర్చను నిర్వహించారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.మన బడి నాడు నేడు పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.పారిశుద్యం పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్యదర్శులను కోరారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి,ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి,ఎంఈఓ చిన్నయ్య.కార్యదర్శులు విజయకుమార్, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసుల్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాబ్ మేళా ను విజయవంతం చేయాలి



**పీలేరు, ఆగస్టు 24 ప్రభాతవార్తః**

స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా ఆధ్వర ్యంలో స్థానిక వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమా వేశంలో మాజీ ఎమ్మెల్యే జీవీ. శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో శనివారం 26వ తేదీ మదనపల్లె మార్గంలోని ప్రభుత్వ హైస్కూల్ నందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాలను విజయవంతం చేయాలని కోరారు. అలాగే మెగాజాబ్‌మేళా ఏర్పాటుకు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈకార ్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ విజయంపై సంబేపల్లి విద్యార్థులచే భారీ ర్యాలీ

**సంబేపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

చంద్రుని దక్షిణ ధ్రువం పై అడుగుపెట్టిన చంద్రయాన్ 3 విజయంపై సంబేపల్లి మండల కేంద్రంలో గురువారంవిద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం నుండి ప్రారంభమై కడప చిత్తూరు జాతీయ రహదారి గుండా కొనసాగింది. "జయహో భారత్", "మేరా భారత్ మహాన్" అంటూ ప్లకార్డులు, జాతీయ పతాకాలను, వివిధ శాస్త్రవేత్తల చిత్రాలను చేతబట్టి విద్యార్థులు నినాదాలు చేశారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా నిలబడి చంద్రుని పై భారత ఖ్యాతిని నిలిపిన ఇస్రో శాస్త్రవేత్తలకు విజాయాభినందనలు తెలియజేశారు .ఈ సందర్భంగా సర్పంచ్ అంచల రామచంద్ర మాట్లాడుతూ చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరిన మొదటి దేశం మనదైనందుకు గర్విస్తూ, ఇందుకు కృషి చేసిన శాస్త్రవేస్తలందరికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ రోజు శాస్త్రవేత్తలు యొక్క కృషి ఫలితమే మన యొక్క శక్తి సామర్థ్యాలను ప్రపంచ దేశాలకు తెలియజేశారన్నారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు ప్రతాపరెడ్డి ఏర్పాటుచేసిన బ్యాండ్ మేళాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన చంద్రయాన్ 3 నమూనా పలువురిని ఆకర్షించాయి. స్థానిక టైలర్ పాటూరి సురేంద్ర విద్యార్థులందరికీ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రమాదేవి, ఎంపీటీసీ భద్రయ్య, పంచాయతీ సెక్రెటరీ రవినాథ్, ఎస్సై మహమ్మద్ షరీఫ్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల పిల్లలకు తిది భోజనం

**చిట్వేలి, ఆగస్టు 24 ప్రభాతవార్త**



చిట్వేలి మండల పరిధిలోని ఎం.వడ్డిపల్లి శిరిడి సాయిబాబా ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం ఎం.గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల పిల్లలకు షడ్రుచులతో కూడిన తిది భోజనం ఏర్పాటు చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, రుచికరమైన భోజనాన్ని పేద పిల్లలకి అందించిన ఆశ్రమ నిర్వాహకులు మురళిని ఎంఇఒ ఈశ్వరయ్య అభినందించారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు, జయరామయ్య, ఉపాధ్యాయులు మురళీమోహన్, సిఆర్‌పి చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

## నందలూరుకు రైల్వేపరంగా పూర్వవైభవం తీసుకురండి



ఎంపికి వినతిపత్రం ఇస్తున్న నందలూరు నాయకులు

**నందలూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త**

ఆకేపాడు ఎస్టేట్ నందు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు, ప్రొటెం స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కలిసి నందలూరులో రైల్వేస్టాఫింగ్ కొరకు వినతిత్రం ఇచ్చి నందలూరులో కరోనా కంటే ముందు ఏయే రైళ్ల నిలుపుతున్నారో ఆ రైళ్లన్నింటిని నిలుపుదల చేయడానికి కృషి చేయాలని, అదేవిధంగా ఆల్విన్ కర్మాగారంలో దానికి ప్రత్యామ్నాయంగా ఒక పరిశ్రమ ఏర్పా టుకు కూడా కృషి చేసి ఏర్పాటు చేయాలని, దానివల్ల నందలూరు మండ లంలో నిరుద్యోగ యువతికి ఉద్యోగ అవకాశం కల్పించినట్లు ఉంటుందని కోరడ మైనది. రైల్వే సమస్య మీద సానుకూలంగా స్పందించి ప్రస్తుతం నాలుగు రైళ్ల నిలుపు దల చేస్తున్నారని, మిగతా రైళ్లను కూడా నిలుపుదల చేయడానికి కృషి చేస్తానని వెంటనే రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్లో సంప్రదించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో నల్లతిమ్మాయపల్లె సర్పంచ్ గీతాల నరసింహారెడ్డి, జడ్‌పిటిసి గడికోట వెంకటసుబ్బారెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, బిసి సంఘం నియోజకవర్గం అధ్య క్షులు భాస్కర్‌యాదవ్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, ఆనాల మధుయా దవ్, నడివీధి సుధాకర్, బడే, మధురాజు, అరిగె హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కబ్జా కాకుండా కాపాడాలని ఆర్డీఓకు వినతి

**చాపాడు, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

పల్లవోలు, ఖాదరపల్లే, నాగులపల్లె, గ్రామాలకు నీటిపారుదల సౌకర్యం కలిగించే పల్లవోలు గ్రామంలోని చెరువును కబ్జాకు గురి కాకుండా కాపాడాలని గురువారం జిల్లా మైనారిటీ కన్వీనర్ (వైసిపి) షేక్ మహబూబ్ బాషా జమ్మల మడుగు ఆర్డిఓ శ్రీనివాసులు, తహసిల్దార్ సుభానిలకు చాపాడు తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లవోలు గ్రా మంలోని చెరువు సర్వే నెంబర్ 394 లో 228 విస్తీర్ణం కలదని, చెరువులో ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి సర్వే నెంబర్ 386లో ప్లాట్ల నిర్మాణం చేయదల చి చెరువు సంబంధించిన విస్తీర్ణం పూడ్చాడని ఆరోపించారు. అధికారులు చెరువును సర్వే చేయించి బౌండరీ ఏర్పాటు చేయాలని, గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

**రాయచోటి,ఆగస్టు 24 ప్రభాతవార్త :**

రాయచోటి నియోజకవర్గం గాలివీడు మం డలం నూలివీడు పంచాయతీ నక్కలవాం డ్లపల్లి లోని త్రాగునీటి సమస్యను పరిష్క రించాలని గురువారం జిల్లా కలెక్టర్ గిరీష్ పిఎస్‌కు గ్రామ ప్రజలు వినతి పత్రం అందజేశారు బిజెపి రాజంపేట పార్లమెంట్ కన్వీనర్ సాయి లోకేష్ కేంద్ర న్యా యశాఖ మంత్రి నారాయణ స్వామికి వినతి పత్రం పంపారు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జలజీవన్ మిషన్ పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం వైయ స్సార్ జిల్లా చిత్తూరు జిల్లాకు ఇచ్చిన ప్రాధాన్యత అన్నమయ్య జిల్లా కు ఇవ్వక పోవడం దురదృష్టకరమన్నారు నక్కలవాన్లపల్లిలో కనీసం బోర్ కూడా లేకపో వడం ఈ గ్రామ ప్రజలు చుట్టుపక్కల వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు కలెక్టర్ చర్యలు తీసుకొని వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు త్వరలో పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ప్రజలు తెలిపారు.

## దేశ సేవ మహాభాగ్యం

**న్యూఢిల్లి సి.ఆర్.పి.ఎఫ్ డిప్యూటి కమాండెంట్ ఎ.ఆర్.అభిలాష్**

**వైవీయూ, ఆగస్టు 24 ప్రభాతవార్త :**

భారతదేశ మాతృగడ్డపై జన్మించిన మనం దేశ సేవలో అవకాశం పొందడం మహాభాగ్యంగా భావించాలని న్యూఢిల్లీ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్.అభిలాష్ ఉద్బోధించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం మనో విజ్ఞాన శాస్త్ర శాఖ, జాతీయ సేవా పథకం 1 ,4 యూనిట్ల ఆధ్వర్యంలో ' జాతీయ సమైక్యత - భద్రత ' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని క్యాంపస్ లోని సర్ సివి రామన్ విజ్ఞాన భవనంలో గురువారం నిర్వహించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్.అభిలాష్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో బీటెక్ మెకానికల్ ఇంజనీర్ కోర్స్ చదివిన నేను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాసి మొదటిసారిలోనే సైనిక విభాగంలో చేరనన్నారు. 2019లో జమ్ము శ్రీనగర్లో జరిగిన పుల్వామా సంఘటనలో ఉన్న విష యాన్ని గుర్తు చేశారు. చైనా వంతెనను భారతదేశం స్వాధీనం చేసుకునే సమయం లో సైనికుల వీరోచిత పోరాటాన్ని కళ్ళ ముందుంచారు. గ్లాసియర్ లో హిమాని నదాలు వద్ద మైనస్ 52 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతల తట్టుకొని విధులు నిర్వహిం చాల్సి ఉంటుందన్నారు. శరీర ఉష్ణోగ్రతను క్రమ పట్టించుకునేందుకు, రక్త ప్రసరణ సరిగా అయ్యేందుకు ఇంజక్షన్ వేసుకొని విధులు నిర్వహించాల్సి ఉంటుంద న్నారు.

## ఏపీ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీ సేవలు ప్రశంసనీయం..

కడప కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:



జీవనోపాధి కోసం కేకే దుర్గ ఏడాదిన్నర క్రితం ఇంటి పని నిమిత్తం కువైట్ వెళ్లినట్లు ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు భవిష్యత్తు కోసం కష్టం ఉన్నా భరిస్తూ పని చేస్తుండేది. ఆమె భరించలేక కువైట్ నుంచి 5 రోజుల క్రితం పారిపోయి వచ్చి కువైట్ వైకాపా కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డిని దుర్గ కలిసి తన కష్టాలు వివరించింది. ఇండియాకు వెళ్లేందుకు సహాయం చేయాలని అభ్యర్థించిందన్నారు. వెంటనే స్పందించి ఎంబసీ అధికారులతో మాట్లాడారు. ఏపీఎన్ఆర్టీఎస్ ప్రొవిజనల్ కోఆర్డినేటర్ ప్రొద్దుటూరు బాషా, కువైట్ ఎంబసీ అధికారులను కలిసి ఆమెకు పాస్‌పోర్టు ఇప్పించారని తెలిపారు. కువైట్ నుంచి గురువారం ఇండియా చేరుకుంది. బాధితురాలి దుర్గ మాట్లాడుతూ నేను ప్రాణాలతో కువైట్ నుంచి బయట పడతానని అనుకోలేదని బాధను వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏపీఎన్ఆర్టీఎస్ ఛైర్మన్ మేడపాటి వెంకట్, సీఈవో హేమలత, డైరెక్టర్ ఇలియాస్, బాలిరెడ్డి, ఎంబసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్క భజన గురువుకు చేయూతనందించిన కళాకారులు



కడప కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:

కడప జిల్లా వల్లూరు మండలం దిగువపల్లి గ్రామంలో నివసిస్తున్న చెక్క భజన గురువు, సీనియర్ కళాకారుడు దిగువపల్లె వెంకట సుబ్బయ్య గత కొంత కాలంగా షుగర్ వల్ల రెండు కాళ్లు తొలగించడం జరిగింది. అప్పటి నుంచి ఆయనకు జీవనోపాధి లేక ఆయన భార్య కూలి పనికి వెళ్లి పూట గడుపుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన అన్ని రంగాల కళాకారులు స్పందించి ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకట సుబ్బయ్య ఇంటికి వెళ్లి భార్యభర్తలను సన్మానించారు. రాయలసీమ కళాకారుల సహాయక సేవా సంస్థ ద్వారా కళాకారులు అందరూ కలిసి తమ వంతు సహాయం చేశారు. వారికి వితరణ అందించారు. చెక్కభజన గురువు వెంకట సుబ్బయ్య ఆర్యో స్థిఇ, కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి ప్రభుత్వం ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టరుకు రాయలసీమ కళాకారుల సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## చంద్రయాన్-3పై విజయభారతి విద్యార్థులు ర్యాలీ

### శాస్త్రవేత్తలను అభినందించిన నాయకులు




మదనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

చంద్రయాన్-3 విజయవంతంపై పట్టణంలోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, కురవంక సర్పంచ్‌చలపతి, స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సేతులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కీర్తి పతాకాన్ని చంద్రునిపై ఎగురవేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలి పారు. ఇందులో భాగంగానే పట్టణంలో విద్యార్థులచే విజయోత్సవ ర్యాలీ చేపట్టి నట్లు తెలిపారు. యావత్తు ప్రపంచం గర్తించేలా శాస్త్రవేత్తలు జరిపిన చంద్ర యాన్-3 సక్సెస్ కావడం అభినందనీయమన్నారు. అంతరిక్ష పరిశోదనల్లో భారత శాస్త్రవేత్తలు ప్రపంచ రికార్డు సాధించారన్నారు. అగ్రరాజ్యాలకు సాధ్యం కాని చంద్రగ్రహం దక్షిణ ధృవంపై మన ఉపగ్రహం క్షేమంగా దించారన్నారు. చంద్రుని దక్షణ ధృవం పైకి అడుగెడిగిన తొలిదేశంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిటిఎం శివప్రసాద్, బిజెపి నాయకులు బండి ఆనంద్, బర్నేపల్లి రవి, వైకాపా సీనియర్ నాయకులు ఎన్ఆర్ఐ మాధవరెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో టిడిపి నాయకులకు బెయిల్

### న్యాయవాదులు వెల్లడి



మదనపల్లె, ఆగస్టు 24 ప్రభాతవార్త :

అంగళ్ళు, పుంగనూరుల్లో చోటు చేసుకొన్న ఘటనలకు సంబంధించి అక్రమ కేసుల్లో ఉన్న టిడిపి నాయకులకు త్వరలో బెయిల్ వస్తుందని వారి తరపున కోర్టులో వాదించిన న్యాయవాదులు తెలిపారు. గురువారం మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు కేసుల్లో ఉన్న టిడిపి నాయకుల బెయిల్‌కు సంబంధించి వాదనలు వినిపించడం జరిగిందని సీనియర్ హైకోర్టు న్యాయవాదులు కోటేశ్వర్‌రావు, హరిబాబు వెల్లడించారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఇతర నాయకులకు వచ్చే సోమవారం లోగా బెయిల్ వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా కేసుల్లో టిడిపి నాయకులను ఇరికించారన్నారు. వైకాపా నాయకులు పక్కా ప్రణాళిక ప్రకారమే దాడిచేసి టిడిపి నాయకులపైన కేసులు పెట్టడం జరిగిందన్నారు.

## రాయితీపై డ్రోన్ పరికరాలు ఏడిఏ శ్రీకాంత్

రామసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త :



పంటల సస్యరక్షణలో ఉపయోగించే డ్రోన్ పరికరాలు రాయితీపై రైతులకు అందించనున్నట్లు జిల్లా ఏడిఏ ఎంవి. శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలను తక్కువ నీటితో, తక్కువ చీడపీడల సమస్యతో, తక్కువకాలంలో, తక్కువ ఖర్చుతో సాగుచేసుకోవచ్చునని ఆయన తెలిపారు. వేరుశెనగ మొక్కలో తేమ లేకపోవడం వల్ల వాడిపోవడం జరుగుతోందన్నారు. వర్షం పడి తేమ లభిస్తే కనీస దిగుబడి పొందే అవకాశం ఉంటుందన్నారు. వరిలో కూడా ప్రస్తుతం ఉన్న వేడి వాతావరణం వల్ల ఆకునల్లి ఉధృతిని పెరిగిందని అరికట్టడానికి ప్రొపెనోఫాస్ అనే మందును పిచకారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మోహన్‌కుమార్, రైతు బరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జస్టీస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం గొల్లపల్లి గ్రామంలో పోలాక్షమ్మ జాతర సందర్భంగా పొంగళ్లు పెట్టేందుకు వచ్చిన దళితులను పోలాక్షమ్మ ఆలయంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం సిగ్గుచేటని బీజేపీ నాయకులు మేకల ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు పట్టణం ఎస్సీ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో ఎస్సీ, ఎస్టీ కులాల వారిని పురుగుల కంటే హీనంగా చూస్తున్నారని మాస్క్ అడిగినందుకు డా.సుదాకర్‌ను పిచ్చోడిగా చిత్రీకరించి ఏకంగా ఆయన చావుతో మొదలుపెట్టిన మారణకాండ ఎంఎల్‌సీ అనంత్‌బాబు తన దగ్గర డ్రైవరుగా పని చేసిన సుబ్రహ్మణ్యం చంపి ఇంటికి పార్శిల్ పంపడం, పులివెందుల తాలూకా పెద్దకుడాల గ్రామంలో నాగమ్మ అనే దళిత మహిళను క్రూరంగా రేప్ చేసి చంపడం, ధర్మవరంలో స్నేహలత అనే అమ్మాయిని చంపడం ఇలా చెప్పుకుంటూపోతే దళిత, గిరిజన మరియు మహిళలపై దాడులకు అంతే లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికే సమాజంలో బలహీన వర్గాల పట్ల వివక్ష చూపడం బాధాకరమని జస్టీస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను కొనసాగించాలని రెవెన్యూ మరియు పోలీసు డిపార్ట్‌మెంట్ వారు ప్రతి నెలా చివరి రోజున క్రమం తప్పకుండా పౌర హక్కుల రోజును నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుందవరం పుష్పరాజు, కారపాకుల రాజశేఖర్, చెవిటి నాగరాజు, కాకి రామాంజనేయులు, భాస్కర్, విగ్నేష్ పాల్గొన్నారు.

## టి.చదిపిరాళ్లలో పొలం బడి..

కమలాపురం, ఆగస్టు 24, ప్రభాతవార్త:

కమలాపురం మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో వరి పంట పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి మాట్లాడుతూ వరిలో పొలంబడి ప్రధాన సూత్రాలు అయిన ఆరోగ్య కరవైన పంట పెంచడం, మిత్ర పురుగులను సంరక్షించడం, క్రమ తప్పకుండా పొలం పరిశీలించడం రైతును స్వయంగా నిర్ణయాలు తీసుకునే శాస్త్రవేత్తగా తయారు చేయడం గురించి తెలిపారు. నాటిన 24 నుంచి 48 గంటలలో బ్యూటక్లోర్ 1 లీటరును ఎకరాకు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. ప్రత్యక్ష నిరూపణ పద్ధతి ద్వారా వేపగింజల కషాయ ద్రావణం తయారు చేయు విధానాన్ని వివరించారు. అలాగే పలు రకాల పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాకులు మమత, వెంకట కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలింపు



కడప కార్పొరేషన్, ఆగస్టు 24, ప్రభాతవార్త:

వ్యవసాయ భూముల నుంచి కొంత మంది జేసీబీల సహాయంతో టిప్పర్లతో మట్టిని అక్రమంగా తరలించుకొనిపోతున్నారని బాధితులు షేక్ ఆయూబ్, జాల సామేలు ఆరోపించారు. గురువారం కడపలో విలేకరులతో మాట్లాడుతూ రంగ సముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 1084/2, 1084/3 భూముల నుంచి అక్రమంగా మట్టిని కొంత మంది తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టరు, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించామన్నారు. బద్వేలు ఆర్డీవోను కూడా కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. అధికారులు అక్రమదారులను హెచ్చరించినప్పటికీ ఆగడాలు కొనసాగించడం పరిపాటిగా మారిందన్నారు. లబ్ధిదారులను భూమి దగ్గరికి రానివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. గురువారం కూడా టిప్పర్లతో మట్టిని తొలగించే కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించారన్నారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకున్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే పల్లెబాట



కురబలకోట, ఆగస్టు 24 ప్రభాతవార్త :

ప్రజాసమస్యల పరిష్కారమే పల్లెబాట కార్యక్రమం ఎంపిపి దస్తగిరిసాబ్, జడ్పిటిసి బైసాని జ్యోతి అన్నారు. గురువారం పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మట్లీవారిపల్లె గ్రామంలో మండలఅధికారులు, మండల ప్రజా ప్రతి నిధులు పలు గ్రామాల్లో పల్లెబాట నిర్వహించారు. తరిగొండ నుంచి రాయచోటి వరకు రూ.2.40 కోట్లుతో నిర్మించిన తారురోడ్డును ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తనాయినిపల్లె, మట్లీవారిపల్లె, వనమరెడ్డిగారిపల్లె, కొత్తకురవపల్లె, బాకరాపేట, దయ్యాలవారిపల్లెల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. సమస్యలను గురించి ప్రస్తావించి అపరిసృత సమస్యలను నోట్‌చేయడం జరిగింది. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, మట్లీవారిపల్లె సర్పంచ్ సోమిరెడ్డి, ఆర్‌బికే ఛైర్మెన్ శివశంకర్‌రెడ్డి, అంగళ్ళు మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఉమాపతిరెడ్డి, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ట్రాన్స్‌కో ఎల్ఐ మహేష్, మండల పిఆర్ ఇంజనీర్ మదన, ఏఓ రాధ, ఏపిఓ వెంకటేష్, వెలుగు ఏపిఎం నీరజ, గ్రామ విఆర్ఓ ముజీబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామకోటి

రామసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

మండలంలోని కురిజల గ్రామ పంచాయితీ, గుట్టపాలెం గ్రామంలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి గుడిలో శ్రీరామకోటి వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు, అభిషేకాలు నిర్వహించి శ్రీరాముని చిత్రపటానికి పూజలు నిర్వహించి రామకోటి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అప్రకటిత కరెంటు కోతలు ఎత్తేయాలి

### - సీపీఎం డిమాండ్

జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:



కరెంటు ఛార్జీల పెంపుతో ఒక పక్క ప్రజలు సతమతమవుతున్నా మరో పక్క వేళాపాళా లేని కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివ నారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కరెంటు కోత మూలంగా వర్షాకాలం అయినా ఉక్కపోత, మరోపక్క దోమల బెడదతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్రకటిత కరెంటు కోతలను ఎత్తేయా లని డిమాండ్ చేశారు.

## నకిలీ ఇంటి పట్టాలతో మోసపోయాం... న్యాయం చేయండి




ప్రొద్దుటూరు ఆగస్టు 24, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అమృత నగర్ లో నకిలీ ఇంతే పట్టాలతో తమ నుండి డబ్బులు దండుకున్న నరసింహులు కాంతయ్యల నుండి తగిన న్యాయం చేయాలని బాధితులు పాలగిరి బిబి సారా గౌసియా వరలక్ష్మి లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం రెండు లక్షల తో రెండు పట్టాలు గడ్డం నరసింహులు కాంతయ్య ల నుండి కొనుగోలు చేశామని తెలిపారు నాలుగు నెలల క్రితం ఇల్లు నిర్మించుకునేందుకు సంబంధిత స్థలం దగ్గరికి వెళ్ళగా అసలు పట్టాదారులు తమను అడ్డుకున్నారన్నారు అనంతరం విక్రయించిన వారితో మాట్లాడగా తాత్సారం చేశారన్నారు. మోసపోయామన్న బాధితులు వారిని నిలదీయగా డబ్బులు తిరిగి చెల్లిస్తామని అగ్రిమెంటు వ్రాసి ఇచ్చారన్నారు కానీ ఇంతవరకు ఏ విధంగానూ డబ్బులు చెల్లించలేదని వారు వాపోయారు. ఈ నకిలీ పట్టాల మోసగాల నుండి తగిన న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ టిడిపి నాయకులమని చెప్పుకుంటూ తిరిగే వారు నకిలీ ఇంటి పట్టాలతో సామాన్యులను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి భూమాఫియా పై ఇతరుల గురించి విమర్శలు చేయడం కాకుండా తమ పార్టీ నాయకులు సామాన్యులను మోసం చేసే విధానాన్ని తెలుసుకొని నివారించే ప్రయత్నం చేయాలన్నారు. నకిలీ ఇంటి పట్టాలను విక్రయించిన వారిపై వెంటనే తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## రూ.15లక్షలతో సిసిరోడ్లకు భూమి పూజ

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ప్రొద్దుటూరు రూరల్ ఆగస్టు 24, ప్రభాతవార్త

కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మీనాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పర్యటనలో భాగంగా ఆ గ్రామ ప్రజలు రోడ్డు సమస్య ఉందని తెలుపగా అందుకు స్పందించిన ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆనాడే గ్రామ ప్రజలకు నాలుగు నెలల్లో మీ గ్రామానికి రోడ్డు వేస్తామని చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం కొత్తపల్లి పంచాయతీ పరిధి లోని మీనాపురం గ్రామంలో 15 లక్షల రూపాయలతో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద సిమెంట్ రోడ్డు కు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు .సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుండి ఈ గ్రామానికి ఏ ఒక్క అభివృద్ధి జరగలేదని ఈ గ్రామానికి ప్రధానమైన రహదారి ఒకటే ఉన్నందున గడప గడప కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు తమకు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేయగా ఆనాడే వారికి మాట ఇచ్చి కచ్చితంగా నాలుగు నెలల్లో రోడ్డు వేస్తామని వారికి హామీ ఇచ్చామన్నారు. గురువారం వారికి ఇచ్చిన మాట ప్రకారం 15 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. వివేకానంద నగర్, ప్రకాష్ నగర్, మచ్చ కాలనీ, టీచర్స్ కాలనీ, అమృత నగర్, ఆటోనగర్, నూతన కాలువలు రోడ్లు నిర్మిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ గురుస్వామి, ఎంపీ టీసీ పేరం సునీత బ్రహ్మానంద రెడ్డి, వార్డు మెంబర్ లక్ష్మీనారాయణ రెడ్డి, మీనా పురం గ్రామ వైసీపీ నాయకులు, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగ్గురు పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 24, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు ఆర్‌సీఎం చర్చ్ పరిధిలో గురువారం పేకాట ఆడు తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు 3వ పట్టణ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. ఆయన వివరాల మేరకు తమ సిబ్బందికి రాబడిన సమా చారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4520 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నా మన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## జగనన్న పాలవెల్లువకు రుణమేళా

రామసముద్రం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో రైతుబరోసా కేంద్రం వద్ద జగనన్న పాలవెల్లువ రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ నాగప్రసాద్ మాట్లడుతూ అమూల్ డెయిరీలో పాలు పోసిన ప్రతి రైతుకు లాభంచే కూరుతుందని తెలిపారు. పాడి ఆవుల కొనుగోళ్ళకు రూ.75వేలు రుణం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సర్దార్‌బాషా, రెడ్డప్ప, అమర తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పొలంబడి శిక్షణ కార్యక్రమం



జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని బొందలకుంట రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతు అరిగెల నారాయణ పొలంలో వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఏడీఏ వెంకట సుబ్బయ్య పొలంబడి కార్యక్రమంలో పాల్గొని పొలంబడి పథకం గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించి అధిక ఆదాయం పొందేటట్లు సూచనలు, సలహాలు చేశారు. పంట పొలాల్లో వాడాల్సిన ఎరువులు, మందుల వాడకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీహెచ్‌ఏ ప్రశాంత్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శ్రీశక్తిభవన్‌లో మండల సమాఖ్య

ఖాజీపేట ఆగస్టు 24, ప్రభాతవార్త



ఖాజీపేట లోని శ్రీ శక్తి భవన్ నందు గురువారం మండల సమాఖ్య వార్షిక మహాసభ ఘనంగా జరిగింది .ఈ సమావేశంలో మండల సమాఖ్యలో జరి గిన ఆర్థిక లావాదేవీలు అన్నింటిని ఆమోదించారు. శ్రీనిధి బ్యాంకు లింకేజీ ఉన్నతి వినియోగించుకొని జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే మహిళా మార్ట్ గురించి అవగాహన కార్యక్రమం ఏపిఎం వెంకటరమణ రాజు కల్పించారు. అనంతరం మండల సమాఖ్య ఆఫీస్ బేరర్స్ అధ్యక్షురాలుగా మల్లాయపల్లికు చెందిన ఎస్ సరిత ఉపాధ్యక్షురాలుగా కొత్తపేటకు చెందిన కే శివమ్మ,కార్యదర్శిగా జె. హజీరా, ఉప కార్యదర్శిగా కాజీపేట బీసీ కాలనీకి చెందిన నవనీతను, కోశాధికారిగా మల్లీశ్వరి ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపిఎం సి. వెంకటరమణ రాజు సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

## వర్షం కోసం ముస్లింల ప్రార్థన




రాయచోటి, ఆగస్టు 24 ప్రభాతవార్త :

రాయచోటి పట్టణం జామియా మసీదు వద్ద ముస్లిం సోదరులు వర్షం కోసం గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఖరీఫ్ సీజన్లో వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు పంటలు సాగు చేసుకోలేక ఉన్న తోటలు ఎండిపోతుండడంతో వరుణదేవుడు కరుణించాలని ముస్లిం సోదరులు భారీగా పాల్గొని ప్రార్థనలు చేశారు అనంతరం పేదలకు అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు

## ప్రపంచ దేశాల చూపు భారతదేశం వైపు

### సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి




రాయచోటి ఆగస్టు 24, ప్రభాతవార్త

భారతదేశ ప్రయోగించిన చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి అన్నారు. రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం భారత అంతరిక్ష కేంద్రం ప్రయోగించిన చంద్రయాన్ 3 విజయవంతమైన సందర్భంగా రాయచోటి పట్టణంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు భారత అంతరిక్ష కేంద్ర శాస్త్రవేత్తలను అభినందిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయం సాధించడంతో భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్రస్థానానికి చేరిందని ,చందమామ దక్షిణ ధ్రువం పై ప్రథమంగా రోవర్ను పంపిన ఘనత భారత దేశానికి దక్కిందని అభిప్రాయపడ్డారు. చంద్రయాన్ 3 ప్రయోగంలో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించి తద్వారా భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో అగ్రస్థానానికి చేరుకున్నదని వివరించారు. ఈ చంద్రయాన్ 3 విజయాన్ని ప్రతి భారతీయుడు ఆస్వాదించి భారత శాస్త్రవేత్తలకు , మద్దతుగా బాసటగా నిలిచి వారి కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి బాలాజీ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## లోకేష్‌ను పాదయాత్రలో కలిసిన ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 24, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో గురువారం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ప్రొద్దు టూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై ప్రవీణ్ రెడ్డి లోకేష్ వివరిం చారు. తెలుగుదేశం పార్టీ నాయకులంతా ఏకమై రాబోవు 2024 ఎన్నికలలో టిడిపి అభ్యర్థి గెలుపుకు కృషిచేసి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయాలని ఆయన కోరారు.

## శ్మశాన వాటికలో కంపచెట్లు తొలగింపు



గాలివీడు ఆగస్టు 24, ప్రభాతవార్త

మండలంలోని పూలకుంట గ్రామం బొరెడ్డిగారి పల్లె లోని హిందు స్మశాన వాటికలో కంపచెట్లు తొలగింపు కార్యక్రమంను స్థానిక గల్ఫ్ యూత్ చేపట్టారు. గురువారం కొత్తచెరువు సమీపంలోని స్మశానవాటికలో ఏపుగా పెరిగిన కంపచెట్లు ను ముళ్ళపొదలు ను గల్ఫ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పనులు చేశారు.ప్రధానంగా హిందువులకు స్మశానవాటికలో లేకపోవటంతో కొత్త చేరువు పరిసర ప్రాంతంలో స్మశానం లో ఖండన చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మనుషులు వెళ్ళడానికి వీలు లేకుండా ఉండడంతో కంపలు ముల్లంపొదలు తొలగించడానికి ముందుకు వచ్చారు.ఇవే కాకుండా గ్రామంలో మరికొన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు గల్ఫ్ యూత్ సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ యూత్ సభ్యులు ఆంజనేయులు, బాలాజీ, స్థానిక యూత్ రమేష్ నాగేశ్వర వీరాంజినేయులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

మదనపల్లెక్రైం, ఆగస్టు 24 ప్రభాతవార్త :

మదనపల్లె కోర్టులో సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలంటూ ఏడిజే, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీకుదిరే అన్ని రకాల కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని లబ్దిపొందాలన్నారు. ఇందులో కేసులు పరిష్కరించుకుంటే కాలం, నగదు ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఏళ్ళ తరబడి పరిష్కారం కాని దీర్ఘకాలిక కేసులను పరిష్కరించుకోవాలంటూ న్యాయమూర్తి తెలిపారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ భగవాన్ వెంకయ్యస్వామి 13వ ఆరాధన మహోత్సవం



బద్వేల్ అర్బన్, ఆగస్టు 24 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సాయిబాబా గుడికి పై భాగమున అనంతగిరి క్షేత్రం నందు వెలసిన భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వామి వారి 13 ఆరాధన మహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు,ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి షణ్ముఖ ఆచార్యులు ఆధ్వర్యంలో వెంకయ్య స్వామివారికి తెల్లవారుజామునుండే వివిధ రకాల ప్రత్యేక పూజలను నిర్వహించారు, అనంతరం లక్ష్మి గణపతి హెూమం, చండీ హెూమం, రుద్ర హెూమం, లక్ష్మీనారాయణ గాయత్రి హెూమం, నవగ్రహ హెూమం, సుదర్శన హెూమం, తో పాటు మహా పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితులు పలుగురాళ్లపల్లె సుబ్బరామ శర్మ గారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు,అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షులు సముద్రాల దత్తాత్రేయ, సెక్రటరీ బోవిల యానాదిరెడ్డి, ట్రెజరర్ బిజి వేముల సుబ్బారెడ్డి, మరియు కమిటీ సభ్యులు భోవిల్ల రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, బోలా నారాయణ, గాజులపల్లి కృష్ణయ్య, శేఖర్ రెడ్డి, విశ్వేశ్వరరావు, విజయకుమార్, తో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్ల తోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు,అనంతరం సాయంకాలం పలు ప్రధాన రహదారుల్లో శ్రీ శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారు గ్రామస్తులం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు, స్వామివారికి భక్తులు అడుగడుగునా నీళ్లు వారి పోసి కాయ కర్పూరం సమర్పించి మొక్కలను తీర్చుకున్నారు గ్రామస్తం వెంబడి సాంస్కృతిక కార్యక్రమాలు పాల్గొని ఆకట్టు కునే విధంగా నిలిచాయి, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం వైస్ ప్రెసిడెంట్ మునగా చలమయ్య కనుమర్లకోటి లక్ష్మయ్య, సోమిరెడ్డి పల్లె సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు నేలటూరి సుబ్బిరెడ్డి, మునగ హరి కందుకూరి రమేష్, నాగేంద్ర, జూటూరు రవికుమార్ కళ్యాణి, సముద్రాల రాజేంద్ర సౌజన్యతోపాటు పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు, స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు రైల్వే కాంట్రాక్టర్ చిన్ రెడ్డి శ్రీనివాసులురెడ్డి అరవ శ్రీనివాసులురెడ్డి అరవ రమణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం




సంబేపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త :

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి అన్నారు. సంబేపల్లి మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం విద్యార్థులకు పోషకాహారం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోటీన్లు, పిండి పదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజలవణాలు, పీచు పదార్థాలు, నీరు అవసరమైన మోతాదులో తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తక్కువగా తీసుకున్నప్పుడు విటమిన్ లు, ఖనిజలవణాల కొరత ఏర్పడుతుందని అన్నారు. వీటి కొరత వలన రేచీకటి, రక్తహీనత, థైరాయిడ్ సమస్యలు వస్తాయన్నారు. ఒక కేజీ శరీర బరువుకు ఒక గ్రాము ప్రోటీన్లు ఒక రోజుకు అవసరమవుతాయని అన్నారు. ప్రోటీన్ల కొరత ఏర్పడితే శారీరక అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ఫలితంగా మానసిక వికాసం కలగదన్నారు. విద్యార్థి దశలో అభ్యసనాభివృద్ధి సక్రమంగా జరగాలంటే సమతుల ఆహారం తీసుకోవడమే సరైన మార్గం అని అన్నారు. పాకెట్లలో నిలువ ఉంచిన జంక్ ఫుడ్ లో ఉప్పు, చక్కెరలు అధికమోతాదులో ఉంటాయని అవి శరీరానికి హాని చేస్తాయని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసమే పోషకాహారముతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. కూరగాయల అన్నము, పప్పు, సాంబారు, పొంగలితో పాటు వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు, మూడు రోజులు రాగి జావా, మరో మూడు రోజులు చిక్కి విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. వీటిలో విద్యార్థికి అవసరమైన అన్ని పరీక్ష పదార్థాలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులు ఆహార ఆవశ్యకత గురించి జట్లలో చర్చించి నివేదికలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శంకరయ్య, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతకు చర్యలు తీసుకోండి



పులివెందుల, ఆగస్టు 24, ప్రభాతవార్త :

విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. పులివెందులలోని అహోబిళాపురం ఉన్నత పాఠశాలలో గురువారం నియోజవర్గంలోని 52 ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఏడు మంది ఎంఈవోల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసు సంక్షేమ సహాయకులు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులతో పాఠశాల స్థాయి పాఠశాల స్థాయిలో పాఠశాల విపత్తు నిర్వహణ కమిటిని ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్యాబ్ల వినియోగం, ఉపాధ్యాయుల ముఖ హాజరు సమస్యలు, పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యేందుకు ఓపన్స్కూల్ విధానంలో డ్రాపౌట్స్ విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేప కషాయం పిచికారితో లద్దెపురుగు నివారణ



కొండాపురం, ఆగస్టు 24, ప్రభాతవార్త :

వేపగింజల కషాయం తయారు చేసి పిచికారి చేయడం వలన వేరుశెనగ పంటకు హానిచేసే లద్దెపురుగు ఉధృతి నివారించడం సాధ్యమవుతుందని కొండాపురం మండల వ్యవసాయాధికారి ఎ.వి.రామాంజులరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మురగంపల్లెలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అలాగే పచ్చదోమ ఉధృతిని తగ్గించడానికి లాన్సర్గోల్డ్ అనే రసాయనాన్ని 15గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని తెలిపారు. వేరుశెనగ పంట బెట్ట పరిస్థితి నుండి తట్టుకోవడానికి యూరియా 20గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. రైతులు తప్పకుండా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని,ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో ప్రశాంతమ్మ, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన



పులివెందుల రూరల్, ఆగస్టు 24, ప్రభాతవార్త :

పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థి ప్రేరణ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయవాదులు శశిరేఖ, ఆర్.శివకాంతలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు గురించి విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలను తెలిపారు. మహిళా పరిరక్షణ చట్టం, వరకట్న నిషేధం, గృహహింస చట్టాలను, అంతర్జాలం వలన ఉపయోగాలు, సమస్యల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, పీఆర్వో బాలనారాయణ, సిప్ కోఆర్డినేటరు డాక్టర్ కె.విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి, ఆగస్టు 24, ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి ధనలక్ష్మి సోమవార ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు 20, సహాయకురాలు 37, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 11 పోస్టుల కోసం ప్రభుత్వం నుండి నోటిఫికేషన్ వెడుబడినట్లు తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ధరకాస్తు ఫారం సంబంధిత కార్యాలయంలో లభించునట్లు తెలిపారు. ఈ నెల 31 వ తేదీ లోపల జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించి తగు రసీదు పొందవలెనని ఆమె తెలిపారు.

## భారతిడిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన



పీలేరు, ఆగస్టు 24 ప్రభాతవార్తః

ప్రధానమంత్రి ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై స్థానిక భారతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదేషావలి మాట్లాడుతూ మహిళలకు, నిరుద్యోగయువతీ యువకులు ఆర్థికంగా స్థిరపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో వారికి ఉన్న పరిజ్ఞానాన్ని ఆధునిక పరిజ్ఞానం జోడించి వ్యాపారాన్ని సమున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సంకల్పించిందని తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలు, పురుషులు ఎవరైనా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తమ పరిశ్రమ యొక్క అభివద్ధికి లేదా నూతన పరిశ్రమ స్థాపనకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజంలో ఫుడ్ ప్రాసెసింగ్కి ఎక్కువ డిమాండు ఉందన్నారు. వ్యాపార అభివద్ధికి కావలసిన పరికరాల కొనుగోలుకు అయ్యే ఖర్చులో 10 శాతం మాత్రమే లబ్దిదారులు పెట్టుబడిగా 35 శాతాన్ని సబ్సిడీగా 55 శాతాన్ని బ్యాంకు నుంచి రుణం పొందవచ్చునని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు 10లక్షలు లేదా పాసింగ్ రంగానికి సంబంధించి మూలధనంలో 35 శాతం రైతు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. బియ్యం పిండి రైస్ బ్రాన్ ఆయిల్, నూడిల్స్, పిండి, అప్పడాల ప్యాకెట్లు, మామిడి జ్యూస్, వేరుసెనగ పప్పు ఆహార ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు తగిన మూలధనాన్ని లోన్ రూపలో సబ్సిడీ రూపంలో ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలియజేశారు. ఈఅవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాల్సిందిగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేసి తెలియజేయవలసిందిగా పీఎంఎఫ్ఎంఈ స్కీమ్ యొక్క ఉద్దేశ్యం దానికి సంబంధించిన అర్హతలు, కావలసిన డాక్యుమెంట్సు ఏ విధంగా దరఖాస్తు చేయాలో వాటి గురించి గ్రామీణ ప్రజల మహిళలకు అవగాహన కల్పించారు. ఈఅవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదేషావలి, ప్రిన్సిపాల్ రవిశేఖర్ రెడ్డి, అధ్యాకులు, సీఎన్ఆర్ కళాశాల విద్యార్తులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

– బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపు



జమ్మలమడుగు, ఆగస్టు 24, ప్రభాతవార్త:

బస్సు యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ నాయకులు నారాయణరెడ్డి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి – దేశాన్ని కాపాడండి పేరుతో జరుగుతున్న సీపీఐ 26 జిల్లాల బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలన విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు పరుస్తూ కేంద్రంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలేసి అధికారమే పరమావదిగా ప్రభుత్వాలను నడుపుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక తిరోగమన విధానాలను ఎండగట్టడానికి తద్వారా ప్రజలను చైతన్యం చేయడానికి సీపీఐ ఈ యాత్ర చేపట్టిందన్నారు. ఆగస్టు 30వ తేదీ జిల్లాలోని బద్వేలు నియోజకవర్గంలో ప్రారంభమై కడప, కమలాపురం, 31న ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల గుండా సాగుతుందన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జమ్మలమడుగు మైలవరం మండల నాయకులు ఓబులేసు, వెంకటరమణ, దనుంజయ, నారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ హామీలుగా అనేక పథకాలు

కాశినాయన, ఆగస్టు 24ప్రభాతవార్త:

యువనేత రితీష్రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కాశినాయన మండలం ఇటుకలపాడు, సావిశెట్టి పల్లె గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన స్త్రీ ఆడబిడ్డ నిధి కింద నెల 1500, తల్లికి వందనం పథకం కింద చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.1500, దీపం పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు టికెట్ లేని బస్సు ప్రయాణం, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయలు, యువతకు 20 లక్షల పారిశ్రామిక ఉద్యోగులు, నిరుద్యోగికి 3000 రూపాయలు, తెలుగుదేశం ప్రభుత్వం రాగానే ఈ పథకాలు అమలవుతాయన్నారు. ఈ పథకాల గురించి తెలుగుయువత మండలాధ్యక్షుడు రవీంద్రారెడ్డి కరపత్రాలు ఇచ్చి వివరించారు. ఈ కార్యక్రమంలో కాశినాయన మండలం తెలుగు యువత అధ్యక్షులు రవీంద్రారెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి హుస్సేన్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు



లక్కిరెడ్డిపల్లి, ఆగస్టు 24, ప్రభాతవార్త :

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు ఆదర్శ పాఠశాలలో 2023 ఏప్రిల్ లో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో శ్రీనివాసులు 567 మార్కులు సాధించి పాఠశాలస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు 2000 రూపాయలు నగదు ప్రశంసా పత్రాన్ని శివశంకర్రెడ్డి అందజేశారు అలాగే జాతీయ మెరిట్ స్కాలర్షిప్ కు ఎన్ ఎం ఎం లో ఎనిమిదో తరగతి విద్యార్థులు షణ్ముఖ రాయల్ కీర్తనలు ఎంపికయ్యారు వీరికి ప్రశంసా పత్రాలను కూడా అందజేశారు వీరికి ప్రతి ఏటా ఇంటర్మీడియట్ వరకు 12వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఏదైనా సాధించవచ్చు అని ప్రతి విద్యార్థి కష్టపడి, ఇష్టపడి చదవాలని ఆయన సూచించారు ప్రభుత్వం పెట్టిన పథకాలు స్కాలర్ షిప్స్లను అందుకోవాలని ఆయన విద్యార్థులు సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి నాయక్ విజయ విద్యార్థులు పాల్గొన్నారు.

## తూతూ మంత్రంగా మిడ్డే మీల్స్ టెండర్లు

– విజయవాడలో గోప్యంగా కొనసాగిన టెండర్ల ప్రక్రియ

– అనర్హులకు అందలం ఎక్కిస్తున్నారని విమర్శలు



ఓబులవారిపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త:

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట ఏపీఎండీసీ సంస్థ కొందరికి బంగారు బాతులను తిన్న వారికి తిన్నంత అనే చందంగా నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. ఏపీ ఎండీసీ మోడల్ స్కూల్లో గతంలో మిడ్డే మీల్స్ టెండర్ల ప్రక్రియలో అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారనే విమర్శలు గుప్పిస్తున్నాయి. పబ్లిష్ నోటీసు ఇవ్వకుండానే గోప్యంగా కొంత మందిని దృష్టిలో ఉంచుకొని ఉద్దేశపూర్వకంగా రాజకీయ అండదండలతో అధికారులు అండతోనే టెండర్లకు ప్రక్రియ పూర్తి చేశారన్న విమర్శలున్నాయి. బినామీల రాజ్యం కొనసాగుతుండడంతో నిరుద్యోగ యువత ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేని ఉద్యోగులు తీవ్ర నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు పథకం ప్రకారం ఏపీఎండీసీని అనేక పథకాల ద్వారా అనేక టెండర్ల ద్వారా దోచుకుంటూ వ్యాపారం సాగిస్తూ ఉన్న వారు కోట్లు సంపాదిస్తున్నారు. లేని వారు కూటికి లేక కడు పేదరికంతో అప్పులు చేసుకొని జీవిస్తున్నారని ఇప్పటికైనా ఉన్నతాధికారులు పునరాలోచించి నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేని నిరుద్యోగులకు మధ్యాహ్నం భోజన పథకం టెండరును పంపిణీ చేయాలని మంగంపేట ప్రజలు, నిరుద్యోగులు అధికారులను కోరుతున్నారు.

## ఆరోగ్య సేవలు యాప్లో ఆశాకార్యకర్తలు అప్లోడ్ చేయాలి

చిన్నమండెం, ఆగస్టు 24 ప్రభాతవార్త :



ఆరోగ్య సేవల యాప్లో ఆశా కార్యకర్తలు అప్లోడ్ చేయాలని అన్నమయ్య జిల్లా డి.పి.ఎం.ఓ(ఎన్.హెచ్.ఎం.)అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం విఫ్స్ కార్యక్రమంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లోకవర్ధన్ మాట్లాడుతూ ప్రభు త్వం ఆశాకార్యకర్తలకు ట్యాబ్లు సప్లై చేశారని వాటి ద్వారా ఆశాకార్యకర్తలు వారికి కేటాయించిన వెయ్యి జనాభా ను మ్యాప్ చేసి వారికి అందించు సేవలు యాప్ లో యూలోడ్ చేయాలని ఇందుకోసం ఆశాలకు శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు.ఎప్పటికప్పుడు యాప్ను అప్డేట్ చేసుకుని సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశాకార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని ముఖ్యంగా కరోనా కష్ట కాలంలో వారి సేవలు కొనియాడదగినవి అన్నారు.డాక్టర్ వై. ఎస్.ఆర్ హెల్త్ క్లినిక్ లో సి.హెచ్.ఓ (ఎమ్.ఎల్.హెచ్.పి)లు అందుబాటులో ఉండి 105 రకాల మందులు,14 రకాల పరీక్షలు ఉచితంగా ప్రజలు కు సేవలు అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ,ఎల్.టి.రాము, ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రకళ, స్టాఫ్ నర్సులు శోభారాణి పాల్గొన్నారు.

## డ్రిల్ మ్యాప్ రీడింగ్పై ఎన్సిసి విద్యార్థులకు శిక్షణ



చిట్వేలి, ఆగస్టు 24 ప్రభాతవార్త

చిట్వేలి ఉన్నత పాఠ శాల ఎన్సిసి విద్యార్థులకు 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్సిసి లెఫ్టినెంట్ కల్నల్ రాజకుమార్ ఆదేశాల మేర కు డ్రిల్ మ్యాపింగ్పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నుంచి ప్రారంభించినట్లు చిట్వేలి ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్ తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా గురువారం బెటాలియన్ ఎన్సిసి కడప నుంచి వచ్చిన అవల్దార్లు సమయసింగ్, ప్రకాష్ ప్రమోద్లతో కలిసి ఉదయం డ్రిల్, మ్యాప్ రీడింగ్ అంశాలపై శిక్షణను, సాయంత్రం డ్రిల్ కంపాస్లపై అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిల్ ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణలు అలవరు చుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలరని తెలిపారు. మ్యాప్, కంపాస్లను ఉపయోగించి వివిధ ప్రదేశాలను గుర్తించడంపై అవగాహన కల్పించామన్నారు. ఈ శిక్షణ తీసుకుంటున్న ఎన్సిసి బాల బాలికలు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్రయాన్ - 3 విజయోత్సవ వేడుకలు



పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 24ప్రభాతవార్త:

పోరుమామిళ్ళలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో గురువారం భౌతిక శాస్త్ర విభాగం పర్యవేక్షణలో చంద్రయాన్–3 విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ ప్రకాష్రావు మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయం వెనుక ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతో గర్వించదగినది తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అందరూ ఆనందోత్సవాలతో జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ముక్తకంఠంతో మేరా భారత్ మహాన్, భారత్కిజై జై ఇస్రో చంద్రయాన్–3 అంటూ నినదించారు.

## అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ప్రాజెక్టు అధికారిణి

రాయచోటి టౌన్, ఆగస్టు 24

ప్రభాతవార్త :



పట్టణంలోని మాసాపేట మూడవ అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా ప్రాజెక్ట్ అధికారిని ఎం. ధనలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం అందించాలని అలాగే పిల్లల మానసిక అంశాలను గమనిస్తూ ఉండాలన్నారు. అలాగే ఆగస్టు 2వ తేదీన ప్రారంభించిన టి. హెచ్.ఆర్ కార్యక్రమంలో భాగంగా పేస్ యాప్ ద్వారా గర్భవతులకు మరియు బాలింతలకు అందించే సంపూర్ణ పోషణను అందరికీ అందేలా చూడాలని తెలియజేశారు. అలాగే అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుగుణ మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 500 అడుగుల జాతీయ పతాకంతో విజయోత్సవ ర్యాలీ



వేంపల్లె, ఆగస్టు 24, ప్రభాతవార్త :

చంద్రయాన్3 విజయవంతం కావడంతో వేంపల్లెలో ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వేంపల్లె బస్టాండు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని వేంపల్లె ఎస్సై తిరుపాల్నాయక్ ప్రారంభించారు. వేంపల్లె పురవీధుల గుండా జయహో భారత్ నినాదాలతో ర్యాలీ నాలుగురోడ్ల కూడలికి చేరుకుంది. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రమణారెడ్డి మాట్లాడుతూ చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా అంతరిక్ష యాన చరిత్రలో భారతదేశం రికార్డు సృష్టించిందని తెలిపారు. ఈ మిషన్ విజయవంతం కావడానికి సంపూర్ణ సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## మూతలు పెట్టాలి - దోమలవృద్ధి నివారించాలి

రాయచోటి, ఆగస్టు 24, ప్రభాతవార్త :



మంచి నీటి డ్రమ్ములు, పాత్రలపై మూతలు పెట్టాలని,దోమలు వృద్ధి నివారించాలని, జగనన్న కాలనీలో డెంగ్యూ,చికున్ గున్నియా, మలేరియా జ్వారాలు ప్రబలకుండా జాగ్రత్త పడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ప్రత్యేకంగా పంపిన మెడికల్ టీం సభ్యులు ఎ.శివరామ క్రిష్ణ, యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి లు ప్రజలకు అవగాహన కల్పించారు. రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారి పల్లె వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని జగనన్న కాలనీలో గురువారం మెడికల్ టీం సభ్యులు ఇంటింటా దోమల లార్వా సర్వే చేయడం, దోమల లార్వా దశలోనే నాశనం చేయడంపైన అవగాహన కల్పించారు. జగనన్న కాలనీలో నూతన గృహాలు నిర్మాణ దశలో ఉన్నందున, నీటి కొరత ఉన్నందున మూతలు లేని డ్రమ్ములందు ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉన్న కారణంగా దోమలు వృద్ధి చెందుతున్న విషయం బృందం గుర్తించి ప్రజలు దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేద్దామని,కిటక జనిత వ్యాధులు రాకుండా ఉండాలంటే నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వినియోగించని డ్రమ్ములు బోర్లించి పెట్టాలని, దోమ తెరలు విధిగా వినియోగించాలని చెప్పారు.జ్వరాలు వస్తే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి వెంటనే తెలియజేసి సకాలంలో వైద్య సేవలు పొందాలని తెలిపారు. జ్వర బాధితులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నందు గాని, సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గాని, నారాయణరెడ్డి గారి వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నందు గాని మెరుగైన ఉచిత వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దోమల లార్వా దశలోనే గుర్తించి ప్రజలు నాశనం చేయడంపైన శ్రద్ధ వహించాలని, అలాగే ప్రభుత్వం వైపు నుంచి దోమలు నాశనం చేయడం కోసం ఫాగింగ్ చేయడం వైద్య ఆరోగ్యశాఖ చేస్తుందని తెలియజేశారు.

## రైల్వేకోడూరులో సజ్జల రామక్రిష్ణారెడ్డికి ఘనస్వాగతం



రైల్వేకోడూరు, ఆగస్టు 24 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డికి స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒక వివాహ కార్యక్రమానికి రాజంపేటకు వెళుతున్న సందర్భంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆహ్వానం మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో పంజం సుకుమార్రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి తో పాటు ప్రముఖులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సజ్జల నాయకత్వం, కొరముట్ల శ్రీనివాసులు నాయకత్వం వర్ధిల్లాలని భారీ నినాదాలతో వైసిపి కార్యాలయం దద్దరిల్లిపోయింది. ఇంకా ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, ముజిబ్, కోడూరు మస్తాన్, శెట్టిగుంట షఫి, రమణారెడ్డి, రాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, సర్పంచ్లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, ఆనాల చెంగల్రెడ్డి, గోపి, దార్ల చంద్రశేఖర్, కొప్పల శంకరయ్య, వైఎస్ కరిముల్లా, మారెళ్ల చంద్రశేఖర్, భుజంగేశ్వర దేవాలయ ఛైర్మన్ పోకల సుబ్బరాయుడు, వాటర్ప్లాంట్ రాజా తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

## చెన్నై సర్వీసు పునరుద్ధరణ

ఆర్టీసీ డీఎం బండ్లకుమార్

పీలేరు, ఆగస్టు 24 ప్రభాతవార్తః



స్థానిక డిపో పరిధిలో పీలేరు నుంచి చెన్నైకు సప్తగిరి ఎక్స్ప్రెస్ పునరుద్ధరించినట్లు డీఎం బండ్లకుమార్ తెలిపారు. ఉదయం 6గంటలకు పీలేరు నందు బయలుదేరి 11 గంటలకు చెన్నైకి చేరుతుంది. అలాగే మధ్యాహ్నం 12.45 గంటలకు చెన్నై నుంచి బయలుదేరి తిరుమలకు సాయంత్రం 5గంటలకు చేరుతుంది. 5.15కు తిరుమలలో బయలుదేరి రాత్రి 8గంటలకు పీలేరుకు చేరుతుంది. కావున పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం, సీఐ సుబ్బమ్మ, బీఎస్ఎం బాబునాయక్ కోరారు.